క్లుప్తంగా

నేడు హనుమాన్ జయంతి మహోత్సవాలు



మహోత్సవానికి ముస్తాబైన కార్యసిద్ధి వీరహనుమాన్ దేవాలయం

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రం ఆవరణలోని వీరహనుమాన్ ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి మహోత్సవాలు జరగనున్నాయని సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 5గంటలకు హనుమాన్ జయంతి వేడుకలు, అలాగే తొమ్మిది గంటలకు శ్రీ సీతారాములవారి కల్యాణోత్సవం జరగనున్నాయని చెప్పారు. ఈ ఉత్సవాలకు మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ హాజరవుతున్నారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం జరిగే మండల స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కతురోజు ఉమేష్, ఎంఈఓ బి. బాలు నాయక్ కోరారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, పరుగుపందెం పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

రెండు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి

అర్వపల్లి : యాసంగి సీజన్‌కు గాను జాజిరెడ్డిగూడెం, రామన్నగూడెం, కొమ్మాల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గాను రెండు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి చేసినట్లు జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ సీఈఓ మేడెబోయిన రామస్వామి తెలిపారు. జాజిరెడ్డిగూడెం, రామన్నగూడెం కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని చెప్పారు. కొమ్మాలలో కొనుగోళ్లు నడుస్తున్నాయని తెలిపారు. జాజిరెడ్డిగూడెం, రామన్నగూడెం కేంద్రాల్లో కాంటాలు వేసి ఉన్న ధాన్యం బస్తాలు కొన్ని ఎగుమతి కావాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యం బిల్లులను రైతులకు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నట్లు తెలిపారు.


చెరువు మట్టి తరలింపు



ట్రాక్టర్‌లో తరలిస్తున్న చెరువు మట్టి

చివ్వెంల : అధికారుల నిర్లక్ష్యం వ్యాపారుల పాలిట కల్పతరువుగా మారింది. రియల్ వ్యాపారులు చెరువులు, కుంటల్లో అక్రమంగా మట్టితవ్వి వెంచర్లకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. తిమ్మాపురం గ్రామ చెరువులో గత రెండు రోజులుగా సూర్యాపేటకు చెందిన రియల్ వ్యాపారులు జేసీబీ, 15 ట్రాక్టర్లతో చెరువుమట్టిని తవ్వి తరలిస్తున్నారు. ఈ విషయమై స్థానికులు రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. దీంతో గ్రామానికి చెందిన యువకులు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. ఉన్నతాధికారులు స్పందించి మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాని గ్రామస్తులు కోరుతున్నారు.

కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న రాములు

మునగాల : ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు కోరారు. శనివారం మండలంలోని బరాఖత్‌గూడెంలో ఉపాధి కూలీల పని ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూలీలు ఉపాధి పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం కూలి డబ్బులు చెల్లించకపోవడం సరైందని కాదన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం వారం రోజులలో కూలి డబ్బులు చెల్లించాలని ఉన్నప్పటికీ అధికారులు మాత్రం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో చట్టం అమలులో అనేక లోపాలు ఉన్నాయని విమర్శించారు. డబ్బు పంపిణీ విషయంలో స్లిప్పులు ఇవ్వని కారణంగా అవినీతి జరిగే అవకాశముందన్నారు. ఉపాధి పని ప్రదేశంలో సౌకర్యాలు అమలు చేయడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు సౌకర్యాలు కల్పించాలని, వారం రోజులలో కూలి డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు కిన్నెర వెంకన్న కాంతారావు, ఉప్పలమ్మ, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- రోజుల కొద్దీ ఇబ్బందులు పడుతున్న రైతులు
- కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు



వెలిశాలలో నిల్వ ఉన్న ధాన్యం రాశులు

తిరుమలగిరి : ఆరుగాలం కష్టపడ్డ రైతులు ధాన్యం అమ్ముకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఐకేపీ-సంఘ బంధం, పీఏసీఎస్‌ల ద్వారా మండలంలో 15 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ ఆ కేంద్రాల్లో కొనుగోళ్లు నత్తనడకన జరుగుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చి 15 నుంచి నెల రోజులు గడుస్తున్నా కాంటాలు కావడంలేదు. కాంటాలు అయిన ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తీసుకెళ్లడం లేదు. దీంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో కేంద్రంలో 3 వేల నుంచి 7 వేల బస్తాల వరకు ధాన్యం పేరుకపోయింది.

అదనపు భారం..

మార్చి నెలలో కురిసిన వడగళ్ల వర్షానికి చేతికొచ్చిన వరి పంటకు బాగా నష్టం వాటిల్లింది. వర్షాలకు వడ్లన్నీ రాలిపోయాయి. ఉన్న కొద్దిపాటి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే ఇక్కడ రోజుల కొద్ది ఎదురు చూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేయాలంటే రైతులకు పట్టాలు అవసరమవుతాయి. ధాన్యం రాశులపై కప్పడానికి, ధాన్యం కింద వేయడానికి ఒక్కో రైతుకు 5 నుంచి 10 పట్టాలు అవసరమవుతున్నాయి. దీంతో రైతులు ఒక్కో పట్టాకు రూ.30 కిరాయి చెల్లించాల్సి వస్తోంది. వారిపై రోజుకు రూ.300 అదనంగా భారం పడుతుంది. ఇప్పటికే వందలాది రూపాయలు పట్టాల కిరాయిలకే చెల్లించామని రైతులు తెలుపుతున్నారు.

లారీలు సరిపోను లేకపోవడంతో..

కాంటాలు వేసిన బస్తాలను తరలించేందుకు లారీలు సరిపోను రాకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఉండాల్సి వస్తోంది. ఒక్కో కొనుగోలు కేంద్రానికి ఒక్క లారీ మాత్రమే వస్తోంది. దీంతో కొనుగోళ్లు జరిగిన చోట ధాన్యం బస్తాలు వేగంగా తీసుకెళ్లడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

నెల రోజులు దాటింది



నెల రోజుల క్రితం 145 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. ధాన్యం బస్తాలు కూడా కాంటా అయ్యాయి. లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రం వద్దే ఉండి ఇబ్బందులు పడుతున్నాం.

\- లకావత్ సర్వన్, బండ్లపల్లి

1000 బస్తాలు తీసుకొచ్చాను



నెల రోజుల క్రితం 1000 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. ధాన్యం రాశుల మీద 30 పట్టాలు కప్పుతున్నాను. ప్రతిరోజు పట్టాలకే వెయ్యి రూపాయలు అవుతుంది. దీనికి తోడు ఈ మధ్య కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. అధికారులు స్పందించి వేగవంతంగా ధాన్యాన్ని కాంటా వేయించి మిల్లులకు తరలించాలి.

\- లింగయ్య, గుండెపురి

వైభవంగా లక్ష మల్లె పుష్పార్చన



పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

భానుపురి : పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో సమీపంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో శ్రీహనుమజ్జయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు శనివారం స్వామివారికి సహస్ర నామార్చనతో సామూహిక లక్ష మల్లెల పుష్పార్చన నిర్వహించారు. ఉదయం అభిషేకం, ఆరాధన, అలంకారం, ఆరగింపు, సుందరకాండ పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో దేవాలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కొత్త ఆంజనేయులు, దేవాలయ ప్రధాన అర్చకులు దరూరి రామానుజచార్యులు, అర్చకులు దరూరి శ్రీనాథ్ ఆచార్యులు, కార్యనిర్వాహణ అధికారి ఎంపీ లక్ష్మణారావు, అర్చకులు దరూరి శ్రీధరాచార్యులు, దరూరి పవన్ కుమార్ ఆచార్యులు, దరూరి సంతోష్‌కుమార్ ఆచార్యులు, సముద్రాల చక్రధర్ ఆచార్యులు, శ్రీరంగం రాము, దేవాలయ జూనియర్ అసిస్టెంట్ కీసర దేవేంద్ర చార్యులు తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



తుమ్మలపెన్‌పహాడ్‌లో జన్ను వర్ధంతి సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : ఈ నెల 25వ తేదీన ఏపూరు గ్రామంలో నిర్వహించే సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కమిటీ సభ్యుడు జలగం జనార్దన్ (జన్ను) రెండవ వర్ధంతి సభ, స్థూపం ఆవిష్కరణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తుమ్మలపెన్‌పహాడ్ ఉప సర్పంచ్, ఏఐకేఎంఎస్ డివిజన్ నాయకుడు కల్లంచర్ల చంద్రయ్య అన్నారు. శనివారం తుమ్మలపెన్‌పహాడ్‌లో పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. తాను నమ్ముకున్న సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకూ పేదల పక్షాన పోరాడిన వ్యక్తి జన్ను అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతురాజు ప్రతాప్, కలంచెర్ల ఎల్లయ్య, పీవైఎల్ మండల కార్యదర్శి కలంచర్ల శ్రీను, లింగయ్య, వెంకన్న, పాపక్క, చింతమల్ల మల్లయ్య, అల్లి రాజమ్మ, సోమమ్మ, గంగమ్మ, దేవులపల్లి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మారోజు వీరన్న వర్ధంతి కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్వపల్లి : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవనంలో ఈ నెల 16న జరిగే తెలంగాణ మలిదశ పోరాట యోధుడు మారోజు వీరన్న 24వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సామాజిక తెలంగాణ మహాసభ జిల్లా అధ్యక్షుడు దడిపల్లి వెంకట్ కోరారు. శనివారం అర్వపల్లిలో సభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. నిరంతరం విప్లవ ఉద్యమాలకు ప్రాణం పోసిన గొప్ప తాత్వికుడు వీరన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య, అజీజ్, యాగయ్య, రాము, శ్రీను పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను మూడోసారి గెలిపించాలి



మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య

తుంగతుర్తి : మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించేందుకు కార్యకర్తలు పనిచేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి బూత్ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను మూడోసారి గెలిపించేందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను గడప, గడపకూ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టి గ్రామాల్లో బూత్‌స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నల్లు రామచంద్రారెడ్డి, కటకం వెంకటేశ్వర్లు, దొంగరి శ్రీనివాస్, పులుసు యాదగిరి, వెంకన్న, రమేష్, వెంకన్న, శ్రీను, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా గ్రామసభలు

- కరువైన ప్రజల భాగస్వామ్యం
- అవగాహన కల్పించని అధికారులు
- పల్లెల్లో ఎక్కడి సమస్యలు అక్కడే...



బి.చందుపట్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

చివ్వెంల : సమస్యల పరిష్కారం కోసం రెండు నెలలకు ఒకసారి నిర్వహించే గ్రామసభలు నామమాత్రంగానే జరుగుతున్నాయి. గ్రామాల్లో సమస్యలు ఎక్కడివక్కడే ఉంటున్నాయి. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, అధికారులు హాజరయ్యామా.. సంతకాలు పెట్టామా అన్నట్లుగా గ్రామ సభలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరు, లబ్ధిదారుల ఎంపిక వివరాల నమోదు గ్రామసభల ద్వారా వివరించాలి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న గ్రామసభలు ఆయా గ్రామాల్లో నామమాత్రంగానే సాగుతున్నాయి. అయినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. గ్రామసభ నిర్వహించే తేదీకి ఒక రోజు ముందుగానే పంచాయతీతో పాటు ఆవాసా గ్రామాల్లో కార్యదర్శులు సిబ్బందితో టమకా వేయించాలి. నిబంధనల ప్రకారం విధిగా 18 శాఖల అధికారులు, జనాభాలో సుమారు 20 శాతం మంది గ్రామసభకు హాజరయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. రెండు నెలలకు ఒకసారి సర్పంచ్‌లు, ప్రత్యేకాధికారులు, పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలి. కనీసం 50 మందితో గ్రామసభను ఏర్పాటు చేయవచ్చు. సభకు హాజరయ్యే అధికారులు గ్రామంలోని సమస్యలు నమోదు చేసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలి. పంచాయతీల ఆదాయ వ్యయాలపై నివేదికలను పంచాయతీ కార్యదర్శులు చదివి వినిపిస్తారు. కానీ ఆయా నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. గామాల్లోని ప్రజలు గ్రామసభలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. సభలో కేవలం పంచాయతీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అంగన్‌వాడీ, ఆశాలు తప్పా మిగతా వారు పాల్గొనడం లేదు. దీనికి కారణం గ్రామసభలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం చెందడమేనని పలువురు అంటున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి గ్రామసభల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజల సహకారం కావాలి

గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలి. సభల నిర్వహణపై కార్యదర్శులు తెలియజేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ప్రజలు స్వచ్ఛందంగా సభకు రావాలి. ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించడానికి వీలుంటుంది.

\- టి.గోపి, ఎంపీఓ, చివ్వెంల

స్నేహితుడికి ఆర్థికసాయం అందజేత



పేరబోయినగూడెంలో పాక సతీష్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

నాగారం : మండల పరిధిలోని పేరబోయినగూడెం ఆవాసం గొల్లగూడెం గ్రామానికి చెందిన పాక సతీష్ ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న టెన్త్ క్లాస్ స్నేహితులు శనివారం పాక సతీష్‌ను పరామర్శించి, రూ.11,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో హరీష్, కోడి మహేష్, మెరుగు మధు, బద్రి, మహేష్, నరేష్, గంట శివ, సదీప్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం..

మండల పరిధిలోని శాంతినగర్ గ్రామానికి చెందిన సుంకరి వీరన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, హైకోర్టు అడ్వకేట్ కడియం పరమేశ్వర్ శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఒక క్వింటా బియ్యం, రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలేపాక సోమయ్య, కడియం సతీష్, శ్రీకాంత్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై చర్య తీసుకోవాలి

నాగారం : నాగారం మండల పరిధిలోని పసునూర్ గ్రామంలో గొల్లకుర్మలకు బాసటగా నిలిచే తమ్ము చెట్లను తన స్వలాభం కోసం విక్రయించిన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పసునూర్ గ్రామంలోని ఊరకుంటలో ఉన్న తుమ్మ చెట్లను సర్పంచ్ వేర్పుల సాలయ్య గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా అమ్మడం హేయమైన చర్య అని అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చెట్లను విక్రయించిన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు పండి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

వరద కాల్వ పూడి.. పొలాల్లోకి నీరు

- పంటలు పాడవుతుండటంతో ఆందోళనలో రైతులు
- కాల్వను మరమ్మతు చేయించాలని వినతి



పూడిపోయిన వరద కాల్వ

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో పెద్దచెరువుకు నీళ్లు వచ్చే వరద కాల్వ పూడిపోయి నీరంతా పంటచేలల్లోకి చేరుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వరద కాల్వను కొంతకాలంగా మరమ్మతు చేయకపోవడంతో పూడిపోయింది. ఐదేళ్ల కిందట ఈ కాల్వను నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో మరమ్మతు చేయించారు. కాలక్రమేణ మళ్లీ ఈ కాల్వ పూడిపోయింది. రామన్నగూడెం గ్రామ శివారులోని ఎస్సారెస్పీ 71డీబీఎం కాల్వ నుంచి పెద్దచెరువు వరకు ఈ వరద కాల్వ సుమారు 3 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ కాల్వలో కొంత భాగం మట్టితో పూడి కంపచెట్లతో నిండి నీళ్ల సమీపంలోని చెల్కలు, పొలాలకు వెళ్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం చేతికొచ్చిన వరి పొలాల్లోకి నీళ్లు పోయి పంటలు పాడవుతున్నాయి. వేసవి సీజన్ అయినందున కాల్వల మరమ్మతు చేయడానికి అవకాశం ఉందని సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతు చేయించాలని రైతులు కోరుతున్నారు.

30 ఎకరాల పంటలకు నష్టం..

వరద కాల్వ పూడి పక్కనే ఉన్న సుమారు 30 ఎకరాల పంటలకు వరద నీరు చేరుతుంది. దీంతో పంటలు పాడవుతున్నాయి. ఈ వరద నీరు పొలాల్లోకి చేరడంతో వరిచేలు కోయించలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా కాల్వను మరమ్మతు చేయించి పంట పొలాల్లోకి వరద నీరు రాకుండా చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నీరు చేరడంతో పొలం కోయలేదు



గ్రామ శివారులో వరద కాల్వ వెంటనే నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. ఆ భూమిలో వరి పంట సాగు చేశాను. అయితే ఈ వరద కాల్వ పూడి వరద నీరు మొత్తం వరిపొలంలోకి వస్తోంది. దీంతో వరిచేను కోయించుకోలేని పరిస్థితి ఏర్పడింది. గోదావరి జలాలకు తోడు వర్షపు నీరు ఈ కాల్వ నుంచే చెరువులోకి వెళ్తాయి.

\- జడ వెంకన్న, రైతు

కాల్వను మరమ్మతు చేయించాలి



రామన్నగూడెం శివారులో ఎస్సారెస్పీ 71 డీబీఎం కాల్వ నుంచి పెద్ద చెరువు వరకు ఉన్న వరద కాల్వ పూడి మట్టితో నిండిపోయింది. దీంతో ఈ కాల్వ వెంట ఉన్న మా రెండు ఎకరాల భూమిలోకి నీళ్లు వస్తున్నాయి. వెంటనే అధికారులు మళ్లీ గోదావరి జలాలు వదలక ముందే కాల్వను మరమ్మతు చేయించాలి.

\- మహేష్, రైతు

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



భానుపురి : బాణసంచా కాలుస్తున్న నాయకులు

భానుపురి : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొంది అధికారంలోకి రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం సూర్యాపేటలో విజయోత్సవాలు నిర్వహించుకున్నారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితోపాటు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో వేరువేరుగా బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

తిరుమలగిరి : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించి అధికారంలోకి రావడం పట్ల ఆ పార్టీ నాయకులు శనివారం తిరుమలగిరి తెలంగాణ చౌరస్తాలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వై.నరేష్, ఎంపీటీసీ సభ్యులు జమ్మిలాల్, కౌన్సిలర్ భాస్కర్, కందుకూరి అంబేద్కర్, పేరాల వీరేష్, విశ్వేశ్వర్, రషీద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం అర్వపల్లిలోని వైజంక్షన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, శిగ నసీర్ గౌడ్, దాసరి సోమయ్య, నల్లకుంట్ల శ్రీను, రవి, పెద్ద కోటి, అమీనుద్దీన్, ఎం. విక్రమ్, మేకల సత్యనారాయణ, నిరంజన్, యాదయ్య, మేకల రాంబాబు, వీరయ్య, మంచాల రామ్మూర్తి, చిక్కుల శేఖర్, ప్రవీణ్, కుమార్, లింగరాజు, కిరణ్, నరేష్, వీరమల్లు, సుందర్, ప్రవీణ్, రాంప్రసాద్, మధు, అశోక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కోళ్లం కృష్టారెడ్డి, ఇమ్మారెడ్డి రాజబహదూర్‌రెడ్డి, జటంగి గణేష్, ముత్యం ప్రసాద్, దరిపెల్లి వీరన్న, మద్దెల సురేందర్, బత్తుల వెంకన్న, విఠల్‌రెడ్డి, కిరణ్, మరికంటి మధుసూదన్, వెంకన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎల్కపల్లి వెంకన్న, లాలు నాయక్, వీరబోయిన సైదులు యాదవ్, గోగుల శ్రీను, పాండు నాయక్, మహేష్ యాదవ్, నాగు, సోమాని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : కర్ణాటక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించడం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, శెనగాని రాంబాబుగౌడ్, ఒగ్గు సైదులు, ఎస్‌కె. సైదులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : కర్ణాటకలో కాంగ్రెస్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, మండల ఉపాధ్యక్షుడు పాక అమృతమల్లు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మామునూరి ఉపేందర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు హమీద్, తదితరులు పాల్గొన్నారు.

16న ఆలయ భూముల వేలం

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ భూములకు ఈ నెల 16న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఆవుల సతీష్, దేవాదాయశాఖ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో వారు విలేరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 2023-2024 సంవత్సరానికి గాను ఈనెల 16న సీతారామచంద్రస్వామి ఆలయ భూములు 118 ఎకరాలను కౌలు కోసం వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ వైస్‌చైర్మన్ మామిడి మల్లయ్య, డైరెక్టర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.


జేపీఎస్‌లను బెదిరించడం కేసీఆర్ అహంకారం

కోదాడరూరల్ : రెగ్యులరైజ్ చేయాలని సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరకుంటే తొలగిస్తామని సీఎం కేసీఆర్ బెదిరించడం ఆయన అహంకారానికి నిదర్శనమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదిహేను రోజులుగా సమ్మె చేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌ల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. డెడ్‌లైన్ లోపు ఉద్యోగాల్లో చేరాలని లేకపోతే తొలగిస్తామని ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటంతోనే అభద్రతా భావంతో వరంగల్ జిల్లాలో సోని అనే కార్యదర్శి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఆమెది ఆత్మహత్య కాదని ముమ్మాటికి ప్రభుత్వ హత్యనేనని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ కొండా బీమయ్యగౌడ్, కందుకూరి ఉపేందర్, పాతకొట్ల శ్రీనివాస్, అంతోటి జ్యోతి, కత్తి నాగబాబు, నాగయ్య, నెమ్మాది సురేష్, తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు పరామర్శ

మునగాల : మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు నెమ్మాది ఉపేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటివద్ద చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కన్మతరెడ్డి శశిధర్‌రెడ్డి ఆయనను పరామర్శించారు. కాగా ఇదే గ్రామానికి చెందిన మరో కార్యకర్త సొంపంగు వెంకన్నను కూడా పరామర్శించారు. ఇద్దరికి చెరో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు చెవుల లక్ష్మయ్య, వి.లింగారెడ్డి, పత్తిపాక లక్ష్మీనారాయణ, శశిధర్‌రెడ్డి యువసేన నాయకులు రాయి రవి, సుధాకర్, గుండు సతీష్, యుగంధర్ రెడ్డి, జిల్లేపల్లి వంశీ, మచ్చ వెంకటేష్, డి.లింగయ్య, పుల్లూరు రవి, సూర్యపల్లి నాగరాజు, సూరేపల్లి శ్రీకాంత్, పుల్లూరు బాలకృష్ణ, రమేష్, భూషయ్య తదితరులు పాల్గొన్నారు.

పగలు వెలుగు.. రాత్రి చీకటి



అర్వపల్లి వైజంక్షన్‌లో పగలే వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

అర్వపల్లి : సూర్యాపేట-జనగామ, నకిరేకల్-తానంచర్ల రెండు జాతీయ రహదారులు కలిపే ప్రాంతమైన అర్వపల్లి వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు కొద్ది రోజులుగా పగటి వేళలో వెలుగుతూ రాత్రి వేళల్లో పనిచేయడం లేదు. ఈ జంక్షన్ గుండా రెండు జాతీయ రహదారుల మీదుగా ప్రతిరోజు వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. జంక్షన్‌లో నాలుగు వైపులా రోడ్లు కనిపించడానికి హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు రాత్రి వేళలో ఈలైట్లు వెలుగుతుంటాయి. అయితే ఐదారు రోజులుగా పగలు వెలుగుతూ రాత్రి వేళలో పనిచేయడం లేదు. దీంతో ఈ జంక్షన్‌గుండా వెళ్లే వాహన చోదకులు, వైజంక్షన్ ప్రాంతంలో ఉన్న దుకాణాల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. హైవే అధికారులు స్పందించి రాత్రి వేళల్లో లైట్లు వెలిగేలా, పగటి వేళల్లో బంద్ అయ్యేలా చూడాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.